క్లుప్తంగా

ఓపెన్ వర్సిటీ అడ్మిషన్ల గడువు పెంపు

పుత్తూరు: అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీ అడ్మిషన్ల గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్ పాసైన వారు, ఐటీఐ రెండేళ్ల కోర్సు పాసైన వారు, డిప్లమో పాసైన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. అభ్యర్థులు స్వయంగా యూనివర్సిటీ పోర్టల్ www.braouonline.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు ఈనెల 30 ఆఖరి గడువని తెలిపారు. ఇతర వివరాలకు 9515401088 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఐదుగురు బైండోవర్

బుచ్చినాయుడుకండ్రిగ: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మండలంలోని కల్లివెట్టు, పార్లపల్లె గ్రామాలకు చెందిన ఐదుగురిని గురువారం తహసీల్దారు భార్గవి ఎదుట హాజరు పర్చారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గొడవలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించి, సంతకాలు తీసుకున్నారు.

జిల్లా వక్తృత్వ పోటీల్లో సత్తా


భవ్యశ్రీ

గంగాధర నెల్లూరు: భారత రాజ్యాంగ రచనలో డాక్టర్ అంబేడ్కర్ పాత్ర అనే అంశంపై గురువారం చిత్తూరులోని పీసీఆర్ హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో మండలంలోని నేల్లేపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. ఇక్కడ 10వ తరగతి చదువుతున్న భవ్యశ్రీ మొదటి బహుమతి కైవసం చేసుకుందని హెచ్‌ఎం సుబ్బరత్నమ్మ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం యుగంధరాచ్చారి తెలిపారు. ఈ విద్యార్థిని ఈ నెల 19న కలెక్టర్ షన్మోహన్ చేతుల మీదుగా బహుమతి అందుకోనున్నట్టు వారు చెప్పారు. భవ్యశ్రీని హెచ్‌ఎం, పలువురు టీచర్లు అభినందించారు.

విధులకు హాజరు

సత్యవేడు: మండలంలోని సమగ్రశిక్ష సిబ్బంది 15 మంది సమ్మె విరమించారు. ఈమేరకు తాము విధుల్లో చేరుతున్నట్లు ఎంఈఓ కె.రవికి రాతపూర్వకంగా తెలియజేశారు. గురువారం ఉదయం కార్యాలయ పరిధిలో ఎంఐఎస్, సీఆర్‌ఎంటీఎస్, పీటీఐ, ఐఆర్టీలు విధులకు హాజరైనట్లు ఎంఈఓ తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా ఎరువులు


బీఎన్‌కండ్రిగ : ఎరువులు పంపిణీ చేస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీకి ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భారతి తెలిపారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా, డీఏపీ ఎరువులను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా 21 రకాల సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ రైతు భరోసా, నాణ్యమైన ఉత్పాదకాల సరఫరా, సబ్సిడీ విత్తనాలు పంపిణీ, ఈ–పంట, పంట నమోదు, మార్కెట్ ధరలు, వ్యవసాయ యంత్రీకరణ, పశువైద్యం, ఉద్యా వనశాఖ, పట్టుపరిశ్రమ, వాతావరణ సూచనలు, సలహా మండళ్లు, మట్టి పరీక్షలు తదితరాలు ఉన్నాయని తెలిపారు. ఈ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి


కార్యక్రమంలో పాల్గొన్న సంఘం నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం): స్వాతంత్య్రం కోసం బ్రిటీషు వారితో సంగ్రామంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్వసైన్యాధ్యక్షుడిగా యుద్ధం చేసి వీరమరణం పొందిన వడ్డెర ఓబన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పెనుమూరు వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు పురుషోత్తం, గౌరవ సలహా దారు దేవళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో పెనుమూరు లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ స్వాతంత్య్రం సమరయోధులుగా దేశం కోసం పోరాడిన వారిలో వడ్డెర సామాజిక వర్గం వారు ఉండడం ఎంతో కారణమన్నారు. అనంతరం ఓబన్న చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ మణి, జిల్లా గౌరవ అధ్యక్షుడు బోయకొండ రెడ్డెప్ప, నాయకులు వెంకటరమణ, గుర్రప్ప, చక్రవర్తి, చిరంజీవి, వెంకటేష్, రంగా, తదితరులు పాల్గొన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి


కార్వేటినగరం: వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు


పుత్తూరు: గొబ్బి తడుతున్న విద్యార్థినులు

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో వచ్చిన విద్యార్థులు, అధ్యాపకులతో కళాశాల ఆవరణ కోలాహలంగా మారింది. మామిడి తోరణాలు, అరటి చెట్లు, చెరకు గడలు, పూలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని నింపారు. విద్యార్థినులు రంగు రంగుల ముగ్గులు వేసి, అందులో గొబ్బెమ్మలు పెట్టి, లయబద్ధంగా గొబ్బి నృత్యం చేశారు. అనంతరం భోగి మంట వేసి, కలశ పూజతో సంక్రాంతి పండుగను ఆవిష్కరింప చేశారు. ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ పేర్లతో మూడు రోజుల పాటు తెలుగు లోగిళ్లు పండుగ వాతావరణంతో తొణికసలాడుతుందని తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి, కళాశాల సిబ్బందికి బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య, అధ్యాపకులు వి.వీరయ్య, టి.నరసింహులు, వాణిశ్రీ, శ్రీదేవి, హరిబాబు, దేవకి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి ప్రతిబింబించిన వేడుకలు

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగిమంట చుట్టూ విద్యార్థులు, ఉపాధ్యాయులు కోలాటాలు ఆడుతూ నృత్యాలు చేయడం, పాఠశాల ఆవరణలో పొంగళ్లు పెట్టి, చెరకు గెడలతో అలంకరించడం ప్రత్యేకతను సంతరించుకుంది. పండుగలు ఐక్యతను పెంపొందిస్తాయని, అయితే వీటిని పర్యావరణానికి హాని కలుగనిరీతిలో జరుపుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ వస్త్ర ధారణతో తెలుగువారి సంస్కృతిని ప్రతిబింబించే విధంగా హాజరయ్యారు. విద్యార్థులకు ముగ్గులు, గొబ్బిళ్లు, పొంగలి తయారీ, ముగ్గుల పోటీలు, పాటల పోటీలను నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ భాస్కర్‌రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణను రంగవల్లులతో తీర్చిదిద్దారు. భోగిమంట వేసి విద్యార్థులు గొబ్బిళ్లు తట్టారు. సంప్రదాయ వస్త్రధారణలో హాజరై సందడి చేశారు. ప్రిన్సిపల్ విజయులురెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


నగరి: భోగిమంట చుట్టూ గొబ్బి తడుతున్న విద్యార్థినులు

సీజనల్ వ్యాధులను అరికడదాం


అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

నగరి : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అక్కడక్కడా నిల్వ ఉన్న నీళ్లలో కీటకాలు వ్యాప్తి చెందేందుకు ఆస్కారం ఉన్నందున వైద్యసిబ్బంది వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన వైద్యసిబ్బందికి, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమ కాటు వల్ల వచ్చే డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా మొదలగు వ్యాధుల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వర పీడితులకు ర్యాపిడ్ కిట్ ద్వారా గానీ, స్లైడ్ ద్వారా గానీ వ్యాధి నిర్ధారణ చేసి ట్రీట్‌మెంట్ ఇవ్వాలన్నారు. సూపర్ వైజర్లు క్షేత్రస్థాయిలో ఫ్రైడే- డ్రైడే పక్కా జరిగే విధంగా చూడాలన్నారు. ఏఎన్‌ఎంలకు ఇచ్చిన వెక్టార్ హైజీన్ యాప్‌ను అప్‌డేట్ చేయించే విధంగా వారికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైద్యాధికారులు, సబ్ యూనిట్ ఆఫీసర్లు మోహన్‌బాబు, రామకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ జనార్ధన్, ఎంపీహెచ్‌ఎస్ బాబు, నారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేజీ పురుషోత్తం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు

సత్యవేడు: ఎన్నికలకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో వసతుల వివరాలను సేకరించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సీఆర్పీలకు ఎంఈఓ కె.రవి సూచించారు. గురువారం పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ కేంద్రాలో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్లు వివరాలను నాడు–నేడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో హనుమజ్జయంతి


ఆంజనేయస్వామికి పూజలు

గంగాధరనెల్లూరు: మండలంలో వేల్కూరులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం హనుమజ్జయంతిని స్థానిక ఆస్థాన పండితులు నరసింహ అయ్యంగార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజాది హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

వైభవంగా మౌళి అమావాస్య ఉత్సవం


నగరి: సంకటి వితరణ

నగరి: మున్సిపల్ పరిధి చింతలపట్టెడ శివాలయంలో మౌళి అమావాస్య పూజలు గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. పితృదేవతలకు పిండ ప్రధానం చేయడంలో ప్రాధాన్యం సంతరించుకునే అమావాస్య రోజున ఆలయ నిర్వాహకులు పేద ప్రజలకు సంకటి ముద్దలను అందించడం ప్రత్యేకతను సంతరించుకుంది. పేదలకు ఆకలితీరిస్తే పితృదేవతలను సంతృప్తి పరచినట్లే అన్న ఆచారంతోనే సంకటి వితరణ చేస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

కాసులు కురిపిస్తున్న మైలేర్లు

- సంక్రాంతి మైలేర్ల పేరిట ఇదో దందా
- ఖర్చుకు రెట్టింపు ఆదాయం
- నిర్వాహకుల నుంచి అధికార గణానికి ముడుపులు
- చూసీచూడనట్టు వదిలేస్తున్న ఆయా ప్రాంతాల పోలీసులు


మైలేరులో పరుగులు తీస్తున్న ఎద్దు(ఫైల్)


పరుగులు తీస్తున్న ఎద్దు (ఫైల్)

పలమనేరు: పలమనేరు, కుప్పం నియోజకవర్గాలతోపాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఇక్కడి సరిహద్దు గ్రామాల్లో సంక్రాంతి మైలేర్ల (ఎద్ల పరుగు పందేలు) పండుగ సందడి జోరందుకుంది. ఏటా సాంప్రదాయంగా కేవలం సంక్రాంతి పురస్కరించుకుని ఇక్కడ మైలేర్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే కొన్నేళ్లుగా మైలేర్లను సైతం నిర్వాహకులు ఆదాయ వనరుగా మార్చేశారు. పండుగ పేరిట ఎద్దుల ప్రవేశానికి ఎంట్రీ ఫీజులు భారీగా వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. పెట్టుబడి పెట్టిన వాళ్లకు రెట్టింపు సొమ్ము వస్తుండడంతో మారుమూల గ్రామాలకు సైతం మైలేర్ల వ్యాపార సంస్కృతి విస్తరించింది. ఇది ఇక్కడ లాభసాటి వ్యాపారంలా మారింది. కానీ ఎద్దుల పరుగు పందేల్లో వాటిని నిలువరించే ప్రయత్నంలో ఎద్దుల దాడికి గురై మృతి చెందే వాళ్లు.. తీవ్రంగా గాయపడే కుటుంబాలకు మాత్రం మైలేరు తీరని విషాదం మిగుల్చుతున్నాయి.

ఒక గ్రామాన్ని చూసి మరో గ్రామం

మూడునెలలుగా తమిళనాడులోని పలు చోట్ల పెద్దమొత్తంలో బహుమతులను ప్రకటించి ఎండ్ల పరుగు పందేలు నిర్వహిస్తున్నారు. దీన్ని చూసి పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని పలు చోట్ల మైలేర్లను నిర్వహిస్తున్నారు. ఓ గ్రామాన్ని చూసి మరో గ్రామం డబ్బులు బాగా దండుకోవచ్చనే అత్యాశతో మైలేర్ల జోరు పెరుగుతోంది. దీన్ని కొందరు లాభసాటి వ్యాపారంలా మార్చుకోవడం ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది.

ఇదిమైలేర్ల చరిత్ర....

మైలేరు పండుగల్లో తమిళనాడులో మొదటి బహుమతిగా కార్లు, బుల్లెట్ బైక్‌లు లాంటివి ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో మాత్రం రూ. 2 లక్షల నుంచి 60 బహుమతులదాకా పెడుతున్నారు. మైలేరు అనే పదం తమిళమే. ఈ ప్రాంతం రెండు రాష్ట్రాల నడుమ ఉండడంతో మిశ్రమ సంస్కృతితో ఈ ఎడ్ల పరుగు పందేలను నిర్వహించడం దశాబ్దాలుగా ఇక్కడి ఆనవాయితీ. తమిళనాడులో జల్లికట్టుకు, ఇక్కడి మైలేర్లకు ఎంతో తేడా ఉంది. అక్కడ ఎద్దును నిలువరించడం ప్రధానమైతే, ఇక్కడ ఎద్దులను పరుగెత్తిస్తారు. పోటీలు జరిగే చోట కిక్కిరిసిన జనం మధ్య నిర్ణీత ప్రదేశాన్ని (అల్లి) ఎద్దుకు చూపెడతారు. అనంతరం ఒకే ఎద్దును మూడుసార్లు పరిగెత్తిస్తారు. ఈ మూడు దఫాల్లో సరాసరి తక్కువ సెకండ్లలో గమ్యం చేరిన ఎద్దు విజేతగా నిలుస్తుంది. ఒక్కో మైలేరులో 500 నుంచి 1000 దాకా ఎద్దులు పాల్గొంటాయి. వీటిల్లో ఏదైతే తక్కువ వ్యవధిలో నిర్ణీత ప్రదేశానికి వెళుతుందో అది మొదటి బహుమతిని కైవసం చేసుకున్నట్టే! గతంలో గ్రామస్తులు చందాలేసుకుని పండుగను నిర్వహించి వసూలైన డబ్బుకు సరిపడా బహుమతులను ఇచ్చేవారు. దీంతో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా మైలేర్లు జరిగేవి.

వ్యాపారంగా మార్చేసిన వైనం

ఏదైనా గ్రామంలో మైలేరును నిర్వహిస్తే నిర్వాహకులకు లక్షల్లో డబ్బులు వస్తున్నాయి. మైలేరులో ఎద్దును వదలాలంటే ఒక్కో దానికి ప్రవేశ రుసుంగా రూ.3వేలు వసూలు చేస్తున్నారు. పోటీకి దాదాపు 500 ఎద్లు వస్తే రూ.15 లక్షలు వస్తాయి. ఇందులో మొత్తం బహుమతులకు అయ్యే ఖర్చు రూ.5 లక్షలవుతుంది. నిర్వహణ ఖర్చు రూ.లక్ష కలుపుకుంటే రూ.6 లక్షలు. మిగిలిన రూ.9లక్షలు నిర్వాహకులకు జేబుల్లోకి చేరుతుంది. దీంతో మైలేర్లను నిర్వహించడం యూత్‌కు వ్యసనంగా మారింది. గ్రామ పెద్దలు సైతం దీనిని ప్రోత్సహిస్తున్నట్లు సమాచారం. ప్రవేశ రుసుం పేరిట వసూలు చేసిన మొత్తం సొమ్ములో కొంత పోలీసులకు, మండల స్థాయి నేతలకు, మిగిలించి నిర్వాహకులకు చేరుతోందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు మైలేర్ల పేరిట జేబులు నింపుకునే కార్యక్రమానికి చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

త్వరితగతిన ప్యాచ్ వర్కులు


యాదవ సంఘ నాయకులను సత్కరిస్తున్న మంత్రి రోజా, రామ్‌ప్రసాద్‌రెడ్డి


కల్వర్టును పరిశీలిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి: ప్యాచ్ వర్కులు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆర్కేరోజా ఆదేశించారు. గురువారం మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో ఛిద్రమైన కల్వర్టును అధికారులు, కౌన్సిలర్లతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికుల విన్నపం మేరకు ప్రత్యక్షంగా కల్వర్ట్‌ను పరిశీలించినట్లు తెలిపారు. త్వరితగతిన ప్యాచ్ వర్క్ చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే వార్డులో రూ.కోటి మేరకు రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీలకతీతంగా పనులు చేపడుతున్నామన్నారు. కౌన్సిలర్లు గంగాధరం, మురుగ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి కృషి

పుత్తూరు: యాదవుల అభ్యున్నతికి తనవంతు సహకారం ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. గురువారం నూతనంగా ఏర్పాటైన వడమాలపేట మండల యాదవ సంఘ సభ్యులు నగరిలోని మంత్రిని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా, ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి సంఘం నాయకులను సత్కరించారు. మంత్రి మాట్లాడుతూ అభ్యున్నతికి ప్రణాళికలు రూపొందించుకుని పరిష్కరించుకోవాలని మంత్రి రోజా సూచించారు. సంఘం అధ్యక్షుడు వి.రమేష్, కార్యదర్శి పరశురామ్, ఉపాధ్యక్షుడు వై.సుధాయాదవ్, గౌరవాధ్యక్షుడు కె.సదాశివయ్య, కోశాధికారి చిన్నప్ప, నాయకులు నందయ్య, వెంకటసుబ్బయ్య, ధర్మయ్య, రాజేంద్ర, పాపయ్య, జయరాం, ఆనందయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

- రక్తదానం ప్రాణదానంతో సమానం
- యువకులు ముందుకురావాలి
- ఆర్‌డీఓ సుజన పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సుజన

నగరి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేద్దామని ఆర్డీవో సుజన అన్నారు. రక్తదాన శిబిర నిర్వహణ అంశాలపై చర్చించే నిమిత్తం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం ఉత్తమ దానమన్నారు. రక్తదానం ఒక మనిషి జీవితాన్ని కాపాడుతుందని తెలిపారు. ఇటీవల జరిగిన రైలు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడారన్నారు. అలాంటి సమయంలో యువకులు నిర్ణయం తీసుకోకుంటే మృతుల సంఖ్య పెరిగేదన్నారు. ఈ అంశాన్ని గ్రహించి రక్తదానం చేసేందుకు యువకులు ముందుకురావాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వైద్య అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది హాజరు అయ్యారు.

నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఆడుదాం–ఆంధ్రా


నగరి: వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు


విజయపురం: విజేతగా నిలిచిన విజయపురం జట్టుతో అధికారులు


కార్వేటినగరం: క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లత


వెదురుకుప్పం: వాలీబాల్ విజేత దేవరగుడిపల్లె జట్టు

నగరి: యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఆడుదాం–ఆంధ్రా పోటీలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎంఈవో శ్రీదేవి అన్నారు. గురువారం పట్టణంలోని కేవీకే మైదానం, డిగ్రీకళాశాల మైదానంలో మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను పరిశీలించారు. క్రికెట్‌కు కొంతసేపు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మైదానాలు క్రీడాకారులతో సందడిగా మారాయి. ఎంఈవో మాట్లాడుతూ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయని తెలిపారు. క్రీడాకారులకు తమ ప్రతిభను చాటేందుకు ఈ పోటీలు బాగా ఉపయోగపడుతాయని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందిస్తామన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడల్లో రెండవ రోజు గురువారం స్థానిక ఆర్కే ఎస్సార్ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో హోరాహోరీగా వివిధ పోటీలు సాగాయి. తూ మండల స్థాయి పోటీల్లో కార్వేటినగరం-2 సచివాలయం, కార్వేటినగరం సచివాలయం-3 జట్లు విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచాయి. ఆ జట్లను ఎంపీపీ లత, ఎంపీడీఓ మోహన్‌మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ తదితరులు అభినందించారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధర నెల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం వాలీబాల్, కబడ్డీ విభాగాల్లో క్రీడాకారులు తమ సత్తాచాటారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వీసీ సుబ్రమణ్యం,నరసింహులు, వైస్ ఎంపీపీ హరిబాబు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, ముక్కలత్తూరు ఎంపీటీసీ మగిమైదాస్ పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: బ్యాడ్మింటన్ పోటీల పురుషుల విభాగంలో పచ్చికాపల్లం, మహిళల విభాగంలో బ్రాహ్మణపల్లె జట్టు విజయం సాధించాయి. అలాగే వాలీబాల్ పోటీల్లో దేవరగుడిపల్లె జట్టు, కబడ్డీ పోటీల పురుషుల విభాగంలో బ్రాహ్మణపల్లె, మహిళల విభాగంలో తిరుమలయ్యపల్లె జట్టు విజయం సాధించినట్టు ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. క్రికెట్ పోటీల్లో 13 జట్లు తలపడ్డాయి. మాంబేడు, పాతగుంట, వెదురుకుప్పం, నల్లవెంగనపల్లె జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. ఈఓపీఆర్డీ పురుషోత్తం, ఎంఈఓ ఉమామహేశ్వర్, డీడీఓలు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజు కుప్పం పాఠశాల మైదానంలో క్రికెట్, పాలసముద్రం పాఠశాలలో కబడ్డీ మండల స్థాయి పోటీలను ఏఓ విద్యావతి, విస్తరణాధికారి ర మేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ ప్రారంభించి మాట్లాడారు. సర్పంచ్ గాలి మహే ష్, సర్పంచ్ సుమన్, ఎంపీటీసీ గోవిందరాజ్ పాల్గొన్నారు.


గంగాధరనెల్లూరు: కబడ్డీ ఆడుతున్న క్రీడాకారిణులు